

బాలల
జనవరి 2017
బొమ్మరిల్లు
రూ. 20/-
శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్‌గారి
అద్భుత సీరియల్
విచిత్ర మహల్



# పుణ్యాత్మ పాపయ్య

– ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

అలకానందపురంలో ఒకే ఒక కిరాణాకొట్టు ఉంది. దాని యజమాని పాపయ్య. అతడు మహా పిసినారి. సరుకులు కూడా పైస తగ్గకుండా ఎక్కువ ధరకి అమ్మేవాడు. ఊరివాళ్ళు ఏమీ చేయలేక తప్పనిసరై అతన్ని తిట్టుకుంటూ అక్కడే సరుకులు కొనుక్కునేవాళ్ళు.

అలా అలా ఓ పది సంవత్సరాలు గిర్రున తిరిగిపోయాయి.

ఒకరోజు ఊరివాళ్ళందరూ రచ్చబండ దగ్గర సమావేశమై మన ఊళ్ళో సరైన స్కూలు లేదు. ఆసుపత్రి లేదు. రోడ్ల సంగతి సరేసరి. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పోనీ చందాలు వసూలు చేసి పనులు

చేయిద్దామ్మా అంటే ఒక్కళ్ళూ ముందుకురావడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలో పాలుపోవడం లేదు. అని బాధపడ్డాడు ఆ వూరి పెద్ద రాఘవరావు.

ఎవ్వరూ మాట్లాడలేదు. అనాగరికంగా, అష్టకష్టాలు పడుతూ అలాగైనా జీవించడానికి ఇష్టపడతారు తప్ప మార్పుకోసం ఎవరూ ముందడుగేయలేదు.

అప్పుడు లేచాడు పాపయ్య. అందరూ అతడి వంక చిరాగ్గా చూశారు.

"ఈ ఊరికి కావలసిన ఆసుపత్రికి, స్కూలుకి, రోడ్లు వేయించడానికి నేను సహాయం చేస్తాను.క నాకున్న ఒక్కగానొక్క కొడుకు. బోలెడంత డబ్బు సంపాదించుకుని నేనేం చేసుకుంటాను? చాలా ఏళ్ళ నుంచి మన ఊరి పరిస్థితులు ఇలాగే అద్వాన్నంగా ఉన్నాయి. ఎవరూ బాగుకోసం పూనుకోవడం లేదు. అందుకే నేనే నిర్ణయం తీసుకున్నాను. సరుకులు మీకు ఎక్కువ ధరకి అమ్మి ఆ డబ్బు దాస్తూ వచ్చాను. మరో షాపు వాళ్ళు ఇక్కడ షాపు పెట్టకుండా వాళ్ళకి విషయం చెప్పి సహకరించమన్నాను. వాళ్ళూ సహకరించారు. ఈ రోజు కోసం ఎంతో ఎదురు చూశాను" అన్నాడు.

అప్పుడు ఊరివాళ్ళు "పాపయ్య, నిన్ను ఇన్నాళ్ళు పీనాసి పాపయ్య అని హేళనగా పిలిచేవాళ్లం. ఇప్పటినుంచి పుణ్యాత్మ పాపయ్య అని పిలుస్తాం. మామూలుగా డబ్బడిగితే ఊరిబాగుకోసం ఎవ్వరూ ఇవ్వలేదు. తమ అవసరాల కోసం సరుకులు ఎక్కువ డబ్బుపెట్టి కొక్కుంటే.. ఆ డబ్బు నువ్వుదాచి ఊరికోసం ఖర్చుపెట్టాలనుకోవడం నిజంగా గొప్ప విషయం. నువ్వు ఆర్థిక సాయం చేస్తున్నావు కాబట్టి మేమందరం శ్రమదానం చేస్తాము. ఊరి రూపు రేఖలు మార్చేస్తాం"అన్నారు ముక్తకంఠంతో.

అలా ఆ ఊరు అతి కొద్ది కాలంలో అన్ని హంగులూ సంతరించుకుని కొత్తగా కనిపించసాగింది.